# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# వృత్తాలు

"మేడం! మీకు కాల్ చేద్దామని ప్రయత్నించాను, ఎందుకో వాయిస్ మెయిల్ కి వెళ్ళిపోయింది" చక్కటి ఉచ్చారణతో ఇంగ్లీష్ లో చెప్తున్న కాబ్ డ్రైవర్ కేసి ఒక్క క్షణం ఎక్కువ సేపు చూసింది సుప్రజ..

" అరే, అవునా? నా ఫోన్ మాములుగానే పనిచేస్తోందే!" అంది బాక్ పాక్ ని వెనక సీట్ లో పెట్టి తనూ కూర్చుంటూ..

"ఓ, ఈ నెట్ వర్క్ వాళ్ళు కూడా ఒక్కోసారి మిస్చీఫ్ చేస్తూ ఉంటారు మేం! " అన్నాడు అతను నవ్వుతూ..

జీన్స్, మంచి టీ షర్ట్ లో ఉన్నాడతను, జెల్ రాసుకుని నున్నగా దువ్వుకున్న జుట్టు, నీట్ గా షేవ్ చేసుకున్న నున్నని ముఖం. బాగా చదువుకున్న వాడిలా ఉన్నాడు అనుకుంది.. కొత్త గ్రాండ్ ఐ. టెన్ కార్ చక్కని సువాసనతో హాయిగా ఉంది. మంద్రంగా వినిపిస్తున్న సంగీతం..

" ఒక ముఖ్యమైన కాగితం మర్చిపోయి మళ్ళీ వెనక్కి వెళ్తున్నాను, అది లేకుండా ప్రయాణం చెయ్యడం కష్టం" అంది సుప్రజ.. ఆర్ యూ ఓకే మేం? అన్న అతని ప్రశ్నకి సమాధానంగా.

" ఓ, అలాగా మేడం! మరిప్పుడెలా?" అన్నాడతను కొద్దిగా ఆత్రుత ధ్వనిస్తున్న గొంతుతో..

" ఏమీ లేదండి.. వెనక్కి వెళ్ళి కావలసినది తెచ్చుకుని తర్వాత విమానం ఎక్కడమే!. నేను పెట్టాననుకుని మా వారు, ఆయన పెట్టారనుకుని నేను మర్చిపోయాము. మొదటి సారి ఇలా జరగడం." అంది సుప్రజ..

" టెన్షన్ లో బయలుదేరారా మేడం? అలాంటప్పుడే ఇలా అవుతాయి కదా మామూలుగా" అన్నాడు అతను కొద్దిగా తేలిక పర్చడానికి..

" అవునండి, మా అమ్మమ్మ గారికి బావులేదు, ఐ.సీ యూ లో ఉన్నారు, అక్కడకి వెళ్ళి రావడం లోనే మర్చిపోయాను.. నా ఆఫీస్ బాగ్, ముఖ్యమైన కాగితాలు.. లక్కీగా ఫ్లైట్ లో ఖాళీ ఉంది,“ అంది.

ఆమెకి ఎవరిమీదో తెలియని కోపంగా ఉంది.. చిరాగ్గా ఉంది. మరీ ఎక్కువగా మాట్లాడడం ఇష్టం లేదు.. అందుకే తన కజిన్, చెల్లెలు ఫోన్ చేసి అదే చెప్పింది.

“ కొరియర్ అవి కష్టం, నేనే వెళ్ళి తెచ్చుకుని తర్వాత ఫ్లైట్ లో వెళతాను, కాసేపు ఇంక దీని గురించి మాట్లాడద్దు. నా ఫోన్ లో బేటరీ తక్కువగా ఉంది కూడా..” అంది..

" మేం, ఫోన్ నేను ఛార్జింగ్ కి పెడతాను, ఇటు ఇవ్వండి" అన్నాడతను..

మౌనంగా ఇచ్చింది సుప్రజ..

"పాటలేమైనా పెట్టనా మేం? " అడిగాడు..

“వద్దండి, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ బావుంది “అంది సుప్రజ..

" వాటర్ ఉంది మేడం, ఒకటో రెండో చిన్న బాటిల్స్ పెడతాను కార్లో, కొత్తవే. మీక్కావాలంటే తీసుకోండి" అన్నాడు..

అభినందనపూర్వకంగా చూసింది అతని వైపు...

“మీ పేరు?” అంది..

“భీమన్న మేం, “అన్నాడు..

మనిషికి పేరుకి లింక్ లేదు కానీ భీమన్న? ఇలాంటి పేర్లు కూడా పెడతారా ? ఈ మధ్య కాలంలో అనుకుంది..

మా తాతయ్య పేరు మేడం, నాకు నా జీవితంలో అన్నింటికంటే ఇష్టమైనది  నా పేరు, మా తాతయ్య.. అయినా పేరుదేముంది కదా? అందమైన పేర్లు, రూపం ఉన్నవాళ్ళంతా అందంగా ఉండాలని ఉందా? మనసు అందం ముఖ్యం కదా? అన్నాడు గబ గబా..

“ఓ, సారీ, నా ఉద్దేశ్యం అది కాదు.. మీరు చూస్తే యంగ్ గా ఉన్నారు కదా, ఈ రోజుల్లో అలాంటి పేరా? అని అనుకున్నాను, అంతే!“ అంది.

“నో ప్రోబ్లెం మేం, నేను కూడా మామూలుగానే అన్నాను “అన్నాడు. ఆ తర్వాత కాసేపు మౌనంగా ఉండిపోయాడు అతను..

"మీరు పార్ట్ టైం గా డ్రైవింగ్ చేస్తారు కదూ!" అంది నిశ్శబ్దాన్ని  భంగ పరుస్తూ..

"అవును మేం, మూడు రోజులు, రోజుకి పన్నెండు గంటల చొప్పున ఐ. బీ. ఎం లో నెట్ వర్క్ ఇంజనీర్ గా పని చేస్తాను..మూడు రోజులు డ్రైవింగ్.. నా పేషన్ ఇది“అన్నాడు..

"ఆహా! అనుకున్నాను.. పేషన్ అన్నారు బావుంది.. కానీ సిటీలో డ్రైవింగ్ అంటే సరదా ఏముంది, విసుగు కదా.. సర్కిల్స్ లో, అదే వృత్తాల్లో వెళ్ళడమే కదా! "అంది చిన్నగా నవ్వుతూ..

"జీవితమంటేనే వృత్తాల్లో పరిగెత్తడమే కదా మేం?" అన్నాడు తాత్వికుడిలా..

"అవునా? జీవితమంటే హైవే అంటారు కదా?"

"సాఫీగా సాగిపోతే అంతే, కానీ లేకపోతే వృత్తాలే" అన్నాడు నవ్వుతూ..

"ఎందుకలా అంటున్నారు? ఏమయింది?" అడిగింది ఆసక్తిగా..

" ఏమీ లేదులెండి మేడం! ఊరికే అన్నాను" అన్నాడు నిరాసక్తంగా..

" కాదులేండి, ఏదో ఉంది.. మీ కిష్టం లేకపోతే చెప్పద్దు" అంది సుప్రజ..

మాట్లాడలేదు అతను.

"కొందరికి జీవితంలో కొన్ని ఎప్పుడు వృత్తాల్లో తిరుగుతాయేమో, నాలాంటివాళ్ళకి మరీ.. అది గుర్తొచ్చి అలా అన్నాను.. పారిపోదామన్నా దొరకవు రహదారులు, వృత్తంలో తిరిగి ఆగడమో, లేక అదే పనిగా అక్కడే తిరగడమో" అన్నాడు...

"అంటే?" అర్థం కాలేదు ఆమెకి..

"లేకపోతే ఇక్కడ బీ.టెక్ చేసి యూ.కే వెళ్ళాను మేడం మాస్టర్స్ చదవడానికి.. చివరి సెమెస్టర్ లో ఉండగా తాతయ్య కి అనుకోని జబ్బు వచ్చి, ముదిరిపోయాకా కానీ తెలియని పరిస్థితిలో అక్షరం జాడ తెలియని అమ్మకి తోడుగా ఉండడం కోసం వదిలి వచ్చేశాను. కాలేజీ వాళ్ళేదో దయతలచి డిప్లోమా ఇచ్చారనుకోండి.. అదే అన్నం పెడుతోంది..

నా చిన్నప్పుడే నాన్న పోయారు, నాకందరికన్నా ప్రియుడైన తాతయ్య నా చదువు మధ్యలో పోయారు. నాన్న పోయాకా, తాతయ్యే నాకు, మా అమ్మకీ అన్నీను.. అందుకని ఎక్కడివక్కడ వదిలేసి వచ్చేశాను, అమ్మ పరవాలేదన్నా సరే అదో వృత్తం.. మళ్ళీ చదువనే రహదారికి ఎక్కడమే కుదరలేదు..

కాలేజీ రోజులనాటినించీ డ్రైవింగ్ అంటే విపరీతమైన ఇష్టం. చిన్నవయసులో అందరికీ సహజంగా ఉండేదే, కానీ నాకు మరింత ఎక్కువగా ఉండేది.. ఏదో తెలియని ఆనందం.. సాధించినంత సంబరం.. అది ఫ్రెండ్స్ తో పోటీపడి గెలిచిన చిన్న రోడ్ రేస్ అయినా, దేశ స్థాయిలో జరిగే పందెమైనా.. ఒకసారి బైక్ యాక్సిడెంట్ అయి కాలు విరిగి మంచాన పడి మళ్ళీ బైక్ ముట్టుకోవద్దు అని డాక్టర్ గట్టిగానూ, అమ్మ ఒట్టుతోనూ చెప్తే అది మానేశాను. అది రెండో వృత్తం.." అంటూ ఆగాడు. .

"ఆ తర్వాత డ్రైవింగ్ మీదున్న విపరీతమైన ఇష్టం తో కార్ నెమ్మదిగా డ్రైవ్ చేస్తానని ఇలా మొదలు పెట్టాను" అన్నాడు..

"అయ్యో, అలాగా? నిజమే, కానీ వీటికే అంత వేదాంతమా?" అంది సుప్రజ..

"పరిస్థితిని బట్టే కదా మేడం మన ప్రవర్తన, క్షణం క్రితం వరకూ మీరెంత ఆదుర్దాగా ఉన్నారు?" అన్నాడతను చురుగ్గా..

నాలిక్కరుకుచుంది సుప్రజ.. నిశ్శబ్దం కారంతా పరుచుకుంది..

"మీరన్నారు కదా! పేరు గురించి., మంచి పేరా? మనిషి తీరా? తెలుసుకోకుండా నేనిరుక్కున్న మూడో వృత్తం లాలిత్య..

పేరంత సున్నితంగా ముట్టుకుంటే కందిపోయేంత లలితంగా ఉండే నా భార్య..

నేను యూ.కే నించి తిరిగి వచ్చిన కొత్తలో అమీర్ పేటలో ట్రెయినింగ్ ఇన్స్టిట్యూట్ లో ట్రెయినర్ గా పనిచేస్తున్నప్పుడు అక్కడ సాఫ్ట్వేర్ కోర్సులు నేర్చుకోవడానికి వచ్చేది.. ఆపైన నాకు ఐ.బీ.ఎం లో ఉద్యోగం వచ్చి, మారి పోయినా ఆమె రూపు నన్ను వీడలేదు.

ఆమె అందం, చక్కదనం మరువలేక నెమ్మదిగా పరిచయం చేసుకున్నాను.. ఆమె మనసు కూడా అంతే చక్కనిదనిపించి నా దాన్ని చేసుకున్నాను..

'మా అక్కా, బావా సింగపూర్ వెళ్ళారు హనీమూన్కి,మనం ఈ తుక్కులో ఊటీయా' అంటే చిన్నతనమనుకున్నాను..

'మనకి ఏసీలు లేవు, కార్ లేదు' అని నస పెడుతుంటే వీలున్నవి తెచ్చాను, వీలు కానివాటికి ఫలానా టైముకు తెస్తానని మాటిచ్చాను..

'ఇంటా బయటా పని చెయ్యడం నావల్లకాదు,' ఏంచెయ్యమంటావో చెప్పు, ఒకటే చేస్తానంటే, నీ ఇష్టం అంటూ ఛాయిస్ ఆమెకే ఇచ్చాను..

రోజంతా టీ. వీ దగ్గర కూర్చుని కాలం వృధాచేస్తుంటే, ఏదైనా పనికొచ్చే పని కూడా చేసుకో, మంచి పుస్తకాలు చదువుకో అని సలహా ఇచ్చాను.. దానికే నేనేదో కొట్టినట్టు కళ్ళు వాచేలా ఏడిచి నానా గొడవ చేస్తే పోనీలే నీ ఇష్టం అని చనువిచ్చాను.

చీటికీ మాటికీ, అయినదానికీ, కానిదానికీ గొడవపెడుతుంటే సహించాను, భరించాను.. సహనానిక్కూడా ఒక హద్దుండాలని, ఎక్కడ గీత గియ్యలో తెలుసుకోకపోతె బ్రతుకు ఎంత భారమవుతుందో గ్రహించలేకపోయాను.. భర్తంటే భరించేవాడైనా అన్ని బరువులూ భరించేవి కాదు, భరించడానికి కూడా ఓ హద్దుంది..

అమ్మంటే పెద్ద ఇష్టం లేకపోయినా, విముఖత లేనందుకు సంతోషించాను.. కానీ ఈ త్వరలోనే అమ్మ పట్ల మారిన ఆమె వైఖరి మాత్రం చాలా కష్టమనిపిస్తుంటే ఏం చెయ్యాలో తెలీక మిన్నకుండిపోయాను.. రెండేళ్ళక్రితం అమ్మ దూరమయింది..

మంచితనం ఎంత మహా నేరమో, ఇతరులు చేసే కరకు పనులు మనం చెయ్యలేకపోవడం మన బలహీనతో? అని అర్ధం అయ్యాకా, ఏదో ఒకటి చెయ్యాలనుకున్న తరుణంలో మా మధ్యకు వచ్చిన నా కూతురు రాజిత కోసం ఊరుకున్నాను. రాజి పడుతున్నాను..

ఇది నా జీవితంలో నేను తిరుగుతున్న అతి పెద్ద వృత్తం..

ఆడవాళ్ళు పువ్వులంత సున్నిత హృదయులు అనేవాళ్ళకి మనసుని సుతిమెత్తగా కోసే నా భార్య మాటలు, చేతలు షాకిస్తాయి..

ఇదీ అని చెప్పలేని నరకమంటే అదే.. తెలిసిన తనమా, తెలియని తనమా, మొండితనమా? ఇన్నేళ్ళయినా తెలుసుకోలేకపోతున్నాను.. నా అభిరుచులు, అభిప్రాయాలు ఆమెకుండాలని నేనెప్పుడూ ఆశపడలేదు. నేనన్నా, నాకున్న అమ్మన్నా అభిమానంగా ఉంటే చాలనుకున్నాను.. ఉందంటుంది, నేను లేక ఒక్క క్షణం ఉండలేనంటుంది, దగ్గరున్నంతసేపు మాటలతో కోత కోస్తుంది.. అది అనుభవించేవారికి తప్ప అర్ధం కానిది..

అందమైన రూపానికి అందమైన మనసుంటే ఎంత బావుండునో అనిపించని క్షణం లేదు.. ఇంట్లో ఆవిడ బాధ భరించలేక ఆరు రోజులు వీలైనంత సేపు బయట గడపడం, గడించి ఆవిడ చేతుల్లో పొయ్యడం ఇదే నేను నేర్చుకున్నది.. ఇంటికి వెళ్ళగానే నా ప్రపంచమంతా నా కూతురే..

మా అమ్మా వాళ్ళని వదిలేసి నేను రాను.. అది అమెరికా అయినా సరే! అంటే వాళ్ళిద్దరినీ వదిలి చదువుకు గానీ, మరో ఊరిలో ఉద్యోగానికి కానీ వెళ్ళలేను.. నా కూతురు నా బలహీనత, రేపు బలం అవుతుందనే ఆశ..

అందుకే ఈ వృత్తంలో పడి తిరుగుతున్నాను" అని చెప్పాలనుకున్న మాటలన్నీ మనసులోనే తిరుగుతూ ఉంటే మౌనంగా ఉండిపోయాడు.. గుండ్రంగా తిరుగుతున్న స్టీరింగ్ వీల్ నే చూస్తూ..

**Click here to share your comments on this story**